## పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 14: పంద్రాగస్టు వేడుకలకు పోలీస్ పరేడ్ మైదానం, జిల్లా కలెక్టరేట్ ముస్తాబయ్యాయి. వేడుకలకు హాజరయ్యే వీఐపీలు, అధికారుకు, మీడియా, ఇతరులకు సీటింగ్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

## పాలమూరు రెడ్‌క్రాస్ సేవలు భేష్

గవర్నర్ వర్మను కలిసిన రెడ్‌క్రాస్ సభ్యులు

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మహబూబ్‌నగర్, ఆగస్టు 14 : పాలమూరు రెడ్‌క్రాస్ సేవలు భేష్ అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా, గవర్నర్ కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు లయన్ రమణయ్య రాజ్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించిన గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలను అడిగి తెలుసుకొని అభినందించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై జనజాగరణ

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 14: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, కార్పొరేట్ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆల్ ట్రేడ్ యునియన్ నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో అర్ధరాత్రి వరకు ఒకరోజు జనజాగారణ నిరసన కార్యక్రమం చేపట్టారు.

బహిరంగ ప్రకటన
నమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Ganneti Ramesh S/o G. Narsimulu, age 41 years, Occ: Electrician, R/o H.No.10-1-572.30, Chinthal Basthi, Khairathabad, Hyderabad **Applicant/ Borrower/ Prop. Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఇల్లును తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 5 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.
**SCHEDULE OF THE PROPERTY**
The residential plot bearing plot No.40 admeasuring 150 Sq.Yrds., out of Sy.No.279/a, situated at Pulimamidi Village Shivara of Utkoor Mandal, Narayanpet Dist., which is bounded as under: **East:** Plot No.41, **West:** 20 Ft wide Road, **North:** Plot No.33, **South:** Plot No.45.
**MALLIKARJUN** B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

# విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పేటలో దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్ సిక్తాపట్నాయక్

జనరల్ దవాఖానలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, ఆగస్టు 14: విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని జనరల్ దవాఖానను ఆమె తనిఖీ చేశారు. ఇప్పటివరకు నమోదైన డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 6 డెంగ్యూ, 193 వైరల్ జ్వరాల కేసులు నమోదైనట్లు వైద్య సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. అందుబాటులో ఉన్న డెంగ్యూ నిర్ధారణ పరీక్ష ర్యాపిడ్ కిట్ల వివరాలు, రోజులో ఎన్ని పరీక్షలు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూకేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, అవసరమైన కిట్స్‌వివరాలు అందజేయాలన్నారు. కొరత ఉన్న మందుల వివరాలు తెలియజేయాలన్నారు. దవాఖానలో పడకల కొరత ఉందని, పారిశుధ్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్, సెక్యూరిటీ సిబ్బంది అవసరమని వైద్యసిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సదరం క్యాంప్‌లో సర్టిఫికెట్లను ఏరోజుకారోజే అందజేయాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రాంకిషన్, సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్, ఆర్ఎంవో పావని పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానలో కలెక్టర్ తనిఖీ

పాలమూరు జిల్లా దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

- రోగులకు అందుతున్న వైద్యసేవలు, వసతుల పరిశీలన

మహబూబ్‌నగర్, ఆగస్టు 14: దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. దీంతో అలర్ట్ అయిన వైద్యాధికారులు, వైద్యులు ఒక్కసారిగా విధులకు హుటాహుటిన చేరుకున్నారు. అందరూ డ్రెస్ కోడ్‌తో వైద్యసేవలు అందించారు. అయితే కలెక్టర్ వార్డులలో పర్యటించి రోగులతో వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డెంగీవ్యాధి సోకినవారి కోసం ఆర్‌డీపీ, ప్లేట్ లెట్స్ మిషన్స్‌ను పరిశీలించారు. అనంతరం సూపరింటెండెంట్ డా.సందీప్ కుమార్‌సింగ్ చాంబర్‌లో విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. డెంగీకి మెరుగైన వైద్యసేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గురుకులాలను సందర్శించండి

- రుచి, శుచిపై దృష్టి సారించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- వీసీలో కలెక్టర్, అధికారులకు ఆదేశాలు

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న శాంతికుమారి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 14: రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయాలు, పాఠశాలలు, వసతి గృహాలను జిల్లా సీనియర్ అధికారులు సందర్శించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈనెల 11న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'గాడితప్పిన గురుకులం' శీర్షికన, అలాగే ఈనెల 12న 'డార్మిటరీలు కరవు'.. 'సమస్యల సుడిగుండం..' శీర్షికలతో ప్రచురితమైన కథనాలకు సీఎస్ స్పందించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులు, గురుకుల విద్యాలయాల ఆర్సీవోలు, డీసీవోలు, ప్రిన్సిపాళ్లలో వీసీ నిర్వహించారు. గురుకులాలు, వసతిగృహ విద్యార్థులకు ఇచ్చేభోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛదనం-పచ్చదనం, మొక్కలు నాటే కార్యక్రమాలు, సీజనల్ వ్యాధులు, వ్యాప్తి, దోమల నివారణ చర్యలు, అనుమానిత కేసులు, పరీక్షలు, చికిత్స, ప్రజల ఆరోగ్య సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్, అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ రెండు అంశాలపై నివేదికలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధికుక్కల బెడద నివారించి, ప్రజలను కాపాడేందుకు స్టెరిలైజేషన్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, డీఆర్‌డీఏ నర్సింహులు, డీఎఫ్‌వో సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డా.పద్మ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఛత్రునాయక్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరేడ్ మైదానాన్ని పరిశీలించిన ఎస్పీ

మైదానంలో పరేడ్ ప్రాక్టీస్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేట టౌన్, ఆగస్టు 14: పట్టణంలోని పరేడ్ మైదానాన్ని ఎస్పీ యోగేశ్ గౌతమ్ పరిశీలించారు. వేడుకల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలీసులు నిర్వహించిన పరేడ్ ప్రాక్టీస్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, ఎస్‌బీ సీఐ రాంలాల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

**చెడులవాట్లకు దూరంగా ఉండాలి**

నారాయణపేట టౌన్, ఆగస్టు 14: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులకు నార్కోటిక్ డ్రగ్స్ టెస్ట్ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారుకా ర్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, సీఐలు శివశంకర్, చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, ఎస్సైలు బాల వెంకటరమణ, సునీత పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను అరికట్టాలి

కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, ఆగస్టు 14: జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టి బాల్యవివాహ రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో బచ్పన్ బచావో ఆందోళన్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో కౌమార దశ బాలలను గుర్తించి బడిబయట ఉన్న బాలలను బడిలో చేర్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, జిల్లా సంక్షేమశాఖ అధికారి జయ పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం: కేసు నమోదు

నవాబ్‌పేట, ఆగస్టు14: మండలంలోని కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన వివాహిత దండు మణెమ్మ(45) అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన మణెమ్మ ఈనెల 7న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి ఇంటికి రాలేదని ఎస్సై వివరించారు. మణెమ్మ ఆచూకీ కోసం ఎంత వెతికినా లభించకపోవడంతో భర్త దండు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## బస్సుకు తప్పిన ప్రమాదం

బాలానగర్, ఆగస్టు 14: మండల కేంద్రంలోని ప్రేమ్‌నారాయణ పాఠశాల బస్సుకు బుధవారం తృటిలో ప్రమాదం తప్పింది. ఉదయం పాఠశాల వేళకు మండలంలోని గౌతాపూర్ నుంచి విద్యార్థులతో బాలానగర్ వైపు వెళ్తున్న బస్సు, అమ్మపల్లి శివారులో రహదారిపై ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను తప్పించే ప్రయత్నంలో రహదారి పక్కకు దిగిపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో తృటిలో ప్రమాదం తప్పింది.

## తండాల్లో ఎక్సైజ్ శాఖ అధికారుల దాడులు

మహ్మదాబాద్, ఆగస్టు 14: ఉమ్మడి గండీడ్ మహ్మదాబాద్ మండలాల్లో పలు తండాల్లో బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. గండీడ్ మండలంలో జిన్నారం తండాలో 150 లీటర్ల ఊట బెల్లం ధ్వంసం చేయగా, మహ్మదాబాద్ మండలంలో మంగంపేట్ తండాలో 6లీటర్ల సారా, 10 కిలోల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. బొమ్మికుంట తండా, కొలిమికుచ్చ తండా, కనికెలకుంట తండా, ముందలి తండా, వెన్కి తండా, పంచాంగల్ తండాల్లో పలుగు తండాల్లో దాడులు నిర్వహించారు. దాడుల్లో ఈఎన్‌ఎఫ్‌టీ మహబూబ్‌నగర్, ఎస్‌హెచ్‌వో కోస్గి, డీటీఎఫ్ వికారాబాద్ మూడు బృందాలు పాల్గొన్నాయి. ఉమ్మడి మండలానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసి, పలువురిపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

## డీఈగా లక్ష్మణ్‌గౌడ్

మూసాపేట, ఆగస్టు 14 : మండల పంచాయతీరాజ్ ఏఈగా పనిచేస్తున్న లక్ష్మణ్‌గౌడ్‌కు డీఈగా పదోన్నతి పొందినట్లు ఆయన తెలిపారు. కొన్నేండ్లుగా మూసాపేట, భూత్పూర్, అడ్డాకుల, దేవరకద్ర మండలాల్లో ఏఈగా పనిచేశారు. ఆయన నియోజకవర్గంలో పనిచేసి ప్రజాప్రతినిధులు, ప్రజలతో మంచి పేరు సంపాదించుకున్నారు. అయితే కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు లక్ష్మణ్‌గౌడ్ ఏఈగా పనిచేసినట్లు, అతని పనితీరు నచ్చినందుకు, లక్ష్మణ్‌గౌడ్‌ను ఇప్పుడు మళ్లీ డీఈగా కొడంగల్‌కు బదిలీచేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌సీసీ కొనసాగించాలి

ఊట్కూర్, ఆగస్టు 14: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కేర్ టేకర్ అధికారిని నియమించి ఎన్‌సీసీ యథావిధిగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ అరవిందర్‌కుమార్, మాజీ సర్పంచ్ భాస్కర్ తదితరులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి శ్రీనివాసులు, హెచ్ఎం కుసుమకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు కేర్ టేకర్ పొందే అర్హత ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల కొరత పేరుతో పాఠశాలలో ఎన్‌సీసీ లేకుండా చేసేందుకు ప్రయత్నించడం తగదన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీ హన్మంతు, రిటైర్డ్ పీడీ రమేశ్‌బాబు, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆల పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆల

భూత్పూర్,ఆగస్టు 14 : పట్టణంలోని అమిస్తాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కెంద్యాల శివరాజు తల్లి నర్సమ్మ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. బుధవారం విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మృతురాలి ఇంటికి వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు రామకృష్ణ, బాలకోటి, కోఆప్షన్లు అజీజ్, జాకీర్, బీఆర్ఎస్ నాయకులు సాయిలు, వెంకటేశ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

## బాలరాజు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ

నవాబ్‌పేట, ఆగస్టు14: ఉపాధ్యాయ సంఘం నాయకుడు, పుట్టోనిపల్లితండా పాఠశాల ఉపాధ్యాయుడు బాలరాజు కుటుంబాన్ని మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మంగళవారం బాలరాజు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ శ్రీనివాస్ రెడ్డి రుక్కంపల్లి వెళ్లి అతడి భౌతికకాయంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, డీఈవో రవీంద టర్, ఏఎంవో శ్రీనివాస్, ఎంఈవో రాజునాయక్, సింగిల్‌విండో చైర్మన్ నర్సిములు, మాజీ ఎంపీపీ అనంతయ్య, మాజీ జెడ్పీటీ సీ రవీందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి నివాళులర్పించారు.

## పోలీసుల తనిఖీలు

నారాయణపేట టౌన్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా బుధవారం బాంబ్ నిర్వీర్య పోలీస్ బృందం పోలీసు జాగిలాలతో పట్టణంలోని పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం, పరేడ్ మైదానం, జిల్లా కోర్టు, వీఐపీ గెస్ట్‌హౌస్, బస్టాండ్, ప్రధాన చౌరస్తాలలో తనిఖీలు చేశారు.

## పాఠశాలను సందర్శించిన డీఈవో

జడ్చర్ల, ఆగస్టు 14: మండలంలోని పోలేపల్లిలో గల నవోదయ కాన్సెప్ట్ స్కూల్ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ కొట్టిన విషయం తెలుసుకున్న డీఈవో రవీందర్, ఎంఈవో మంజూలా దేవి పాఠశాలను సందర్శించారు. ఘటనపై విచారణ చేపట్టారు. ఈ ఘటనకు పాల్పడిన కరస్పాండెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు. నవోదయ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు.

## ప్రారంభమైన సామాజిక తనిఖీ

నవాబ్‌పేట, ఆగస్టు14: మండలంలోని అన్ని గ్రామాల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు గాను బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలో చేపట్టిన పనులకు వారం రోజుల పాటు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సేకరించిన వివరాలను ఉపాధి సామాజిక తనిఖీ సిబ్బంది బహిరంగ సభలో వినిపించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో ముసాయిదాబేగం, ఏ పీడీ శ్రీపాద్, డీపీవో ప్రేమలత, అంబుడ్స్‌మెన్ సంతోశ్, ఎస్సార్పీ నర్సయ్య, ఏపీవో జ్యోతి, టీఏలు, ఎఫ్ఏలు, తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన జెడ్పీ సీఈవో

పాలమూరు, ఆగస్టు14: మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ నూతన అధికారి వెంకట్‌రెడ్డి బుధవారం స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

# యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 14: రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆమెరికా పర్యటన జీవితంలో ఎంతో సంతృప్తినిచ్చిందని, సంతోషం నింపిందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రీ, మల్లునర సింహారెడ్డి, లక్ష్మణ్ యాదవ్, ఫయాజ్, సీజే బెనహర్, ఫయ్యామ్ పాల్గొన్నారు.

**జాతీయ స్థాయిలో సత్తాచాటాలి**

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 14: ఉన్నత విద్యకు పునాది అయిన ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థులు తమ లక్ష్యసాధనలో విజయం సాధించేలా వారిని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలో బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ భగవంతాచారి, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్‌జహాన్ పాల్గొన్నారు.

**విద్యుత్ సమస్య లేకుండా చర్యలు**

నియోజకవర్గంలో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం విద్యుత్ భవన్‌లో ట్రాన్స్‌కో ఎస్ఈ పీవీ.రమేశ్, విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాకేంద్రం, హన్వాడ మండలంలో విద్యుత్ సమస్యలపై మాట్లాడారు. నూతనంగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్లపై పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ఏడీ(గ్రామీణం) మద్దిలేటి, డీఈ శివరాం తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరులో వైద్యవిద్యార్థుల నిరసన

ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 14: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి, దారుణంగా హతమార్చిన ఘటనపై మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని బహిరంగంగా ఉరితీయాలన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి, వైద్యరంగం రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తేవాలని, సెంట్రల్ ప్రొటెక్ట్ యాక్టు అమలు చేసి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

# రోల్ మాడల్‌గా నిలవాలి

పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కేక్‌కట్ చేస్తున్న డీఎంహెచ్‌వో

నారాయణపేట టౌన్, ఆగస్టు 14: పేట మెడికల్ కళాశాల రాష్ట్రంలోని రోల్ మోడల్‌గా నిలవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం అప్పక్‌పల్లిలో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలలో లెటర్‌ఆఫ్ పర్మిషన్ వేడుకను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యేలు జ్యోతిప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి వేడుకను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని వారాల కిందట ఎన్ఎంసీ ఢిల్లీ బృందం మెడికల్ కళాశాలను పరిశీలించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, వైస్‌చైర్మన్ హరినారాయణ భట్టడ్, ఐఎంఏఅధ్యక్షుడు మల్లికార్జున్, ఆర్ఎంవోపావని పాల్గొన్నారు.

# కార్మికుల రిలేనిరాహార దీక్షలు ప్రారంభం

మాట్లాడుతున్న కిల్లెగోపాల్

జడ్చర్ల, ఆగస్టు 14: జడ్చర్లలో మున్సిపల్ కార్మికులు బుధవారం రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, శానిటేషన్ కార్మికులు సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన నిరసన కార్యక్రమాలు 9రోజులుగా కొనసాగుతున్నాయి. 10వ రోజు రిలేనిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షలకు మద్దతుగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్, జిల్లా కార్యదర్శి కురుమూర్తి, మండల కన్వీనర్ తెలుగుసత్తయ్య, కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ హాజరై మాట్లాడారు. వేధింపులకు పాల్పడుతున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను బదిలీచేయాలని డిమాండ్ చేశారు.

బహిరంగ ప్రకటన
నమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Gudise Taramma W/o Gudise Ramesh, age 29 years, Occ: Business, R/o H.No.2-79/1, Ujjelly Village, Maganoor Mandal, Narayanpet Dist. **Applicant/ Borrower/Prop. Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఇల్లును తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 5 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.
**SCHEDULE OF THE PROPERTY**
Residential plot No.7, admeasuring 200.0 Sq.Yrds., out of Sy.no.930/A/1, 930/A/2, 930/e, 930/E, located in Block No.23, Ward No.0, situated at Hari pawan colony, Makthal village Shivara of Makthal Mandal, Narayanpet Dist., which is bounded as under: **East:** Plot No.30 Ft wide road, **West:** BC Colony, **North:** Plot No.6, **South:** Plot No.8
**MALLIKARJUN** B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

బహిరంగ ప్రకటన
నమస్త ప్రజానీకానికి తెలియజేయున